


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### బిర్లా గారి పూర్వ పాఠశాల

**తన అమెరికామెడీ కబుర్లేవో** తను రాసుకోక నా కాలమ్‌లో కొచ్చి చిట్టెన్ రాజుగారు..

"ఇదిగో అమ్మాయ్ కబుర్లు ఎక్కడో మొదలుపెట్టి ఎక్కడికో వెళతావేం? అని కూకలేసారు..

"ఏం వెళితేనేం? పాస్ పోర్టూ, వీసా అడగరుగా? అయినా మీరు మాత్రం మీ ఆవిడ పాస్ పోర్ట్ రెన్యువల్ గురించి మొదలుపెట్టి ఆండాళ్ళు లావయిపోవడం గురించి తెగ రాసెయ్యలేదూ?" అని ఎదురు దాడి చేసాను.

అసలే మహిళాదినోత్సవం ఈ వేళ.. అందుకేనేమో ఆయన టోన్ మార్చేసి " ఓ పెద్దమనిషి, నీ సినిమా సెన్సార్ చేసి, నాకు ఫోన్ చేసి నిన్ను తెగమెచ్చుకున్నాడు తెలుసా?" అన్నారు.

నేను చిరునవ్వునవ్వుకున్నాను. నాకెవరైనా సినిమా చూసి "నీకు అవార్డు ఖాయం" అంటారేమోనని తెగ భయం! సినిమా రిలీజైన రోజున ఇంట్లో లేనని చెప్పిస్తాను ఎవరు ఫోన్ చేసినా! ఎందుకంటే.. అవార్డు సినిమాలకి డబ్బులు రావని సినీ ఉద్దండపండితులు అంటారు.. మాకేమో మరి డబ్బులు కావాలి.. ప్రొడ్యూసర్లు ఇంకో సినిమా తియ్యాలి కదా?

అయినా ఈ ధోరణినే కదా ఆ పెద్దమనిషి కూకలేసింది.. అసలు సంగతి వదిలేసాను. అసలు ఈ వేళ పిల్లలకి ప్రాధమిక విద్యకన్నా ముందర నేర్పించే విద్యల కోసం పెట్టిన పాఠశాల గురించి చెప్పాలనుకున్నాను.

నేను నాలుగేళ్ళొచ్చాక బడిలో చేరాను. కానీ ఐదు రాలేదు.. అందుకే మా హెడ్మాస్టారు సీటు ఇవ్వనన్నాడు. అప్పుడు ఈ L.KG,U.KG లు లేవు. డైరెక్ట్‌గా ఫస్ట్‌క్లాసులోనే! ప్రొద్దుట రెండు జడలేసి గౌను తొడిగి, మా అమ్మ తీసుకెళితే చేర్చుకోనన్నాడు. అందుకే మధ్యాహ్నం ఒక్క జడ వేసి, పరికిణీ వేసి తీసుకెళితే నాకు ఐదేళ్ళని నమ్మేసి సీటిచ్చేసాడు ఆ హెడ్మాష్టర్. ఇలాంటి మాష్టరు ఐడియాలన్నీ మా పెద్దమ్మ సావిత్రీదేవిగారివి. అయినా ఈ పెద్దోళ్ళకి కుళ్ళుకానీ, ఇంకో ఎనిమిది నెలలు ఇంట్లో ఆడుకుంటే వీళ్ళకేం పోతుంది? ఎందుకు ఎనిమిది నెలలు ఎక్కువ వేసి బడిలో చేర్పించడం? నాకింకా అర్ధంకాదు! కొంచెం కోపంగా కూడా ఉంటుంది!

ఐనా ఐదో ఏట చేరినా, అప్పటిదాకా మేవేం ఉత్తినే ఇంట్లో కూర్చోలేదు. మావిళ్ళవారి అక్షరమాల కేలండర్ గోడకి పెట్టి, మా అమ్మమ్మ ‘అ‘ నుండి ‘ఱ‘ వరకూ, పన్నెండో ఎక్కం వరకూ తెగ రుద్దించేసింది!

మా అమ్మ కడుపున పుట్టకపోయినా, నాకు తమ్ముళ్ళని చెప్పుకుని ‘అక్కా’ అని నోరారా పిలిచే వాళ్ళు ఈ ఆంధ్రదేశంలో కోకొల్లలు! బహుశా చిన్నప్పుడు రేడియోలో కార్మికుల కార్యక్రమంలో చిన్నక్కా, రమణక్కా అని తెగ విని ఉంటారు! అలాంటి తమ్ముడొకడు ఈ బిర్లాగారి కంపెనీల్లో ఒకటైన కాన్సెప్ట్ స్కూల్స్‌కి సి.ఇ.వో గా ఉన్నాడు. ముంబైలో!

"అక్కా... ప్రీ స్కూల్, ఇకో ఫ్రెండ్లీ... అని తెలుగులో లోగోలో వ్రాసి పంపమని.. అర్జెంట్, కొంపలు అంటుకుంటున్నాయి" అని మెయిల్ పెట్టాడు. నేను వెంటనే ‘పూర్వపాఠశాల.. పర్యావరణ - పరిరక్షణ’ అని లోగోలో వచ్చేటట్లు వ్రాసి రెప్లై ఇచ్చాను. దీంతో వాడు ఊరుకున్నా బావుండేది! కానీ "నువ్వు లాంచింగ్‌కి రావాలి.. బంజారా హిల్స్.. సో అండ్ సో రోడ్." అంటూ గుర్తులు చెప్పాడు.

పోనీ.. పిలిస్తే పిలిచాడని నేను ఊరుకున్నా బావుండేది. కానీ ఊరుకోనుగా.. మనకి నాలికా, పెన్నూ.. రెండూ ఊరుకోవు.

"ఇంతకీ ప్రీ స్కూల్ అంటే ఏవిటి? మూడేళ్ళయినా నిండని చిన్నారుల్ని, బలవంతంగా నిద్రలో నుండి లేపి, కోటేసి, బూటేసి నర్సరీకి పంపిస్తూనే ఉన్నారుగా? ఇంకా ‘ముందు’ అంటే ఏవిటి? " అని అడిగాను.

దానికి వాడు "నీ .. అవర్ ఇండియన్ సివిక్ సెన్స్ ఈజ్ వెరీ బాడ్. అసలు ప్రీ స్కూల్స్ ఉంటే నువ్వూ నేనూ ఇలా ఉండేవాళ్ళం కాదు. ప్రీ స్కూల్‌లో ఏడాది లోపే చేరాలి.. అసలు అమ్మ పొట్టలో ఉన్నప్పుడే. ఆవిడకి ఆరోనెల వచ్చినప్పటి నుండీ ఈ ప్రీ స్కూల్‌లో ఎడ్మిషన్ తీసుకుని వెళుతుంటే, వాళ్ళు ‘ఇకో ఫ్రెండ్లీనెస్’ అంటే నేర్పిస్తారు.. తరువాత పిల్లలు బోర్లాపడడం.. ఫీడర్ బాటిల్ మానెయ్యడం.. పాకడం.. నడవడం.. పాటి హేబిట్స్... ఇలాంటివన్నీ శాస్త్రీయమైన పద్ధతిలో సుశిక్షితులైన టీచర్ల ఆధ్వర్యంలో వీళ్ళకి నేర్పిస్తారు.. రేపు చూస్తావుగా? నువ్వే ఆశ్చర్యపోతావు" అన్నాడు.

"అదేవిటీ?.. పిల్లలు బోర్లాపడితే బొబ్బట్లూ.. నవ్వులకి నువ్వుండలు పంచిపెట్టడం.. అమ్మమ్మలూ, తాతయ్యలూ కాకుండా.. బిర్లాగారు చేస్తారా?" అని ఇంకా ఆశ్చర్యపోయాను.

వాడికి విసుగొచ్చింది!

" సీ ఇండియన్ మెంటాలిటీస్ కి ఏదీ ఒకంతట అర్థంకాదు. మీరు పెంచినట్లు ఇప్పుడు పిల్లల్ని పెంచకూడదు.. ఇప్పుడంతా లేటెస్ట్! ఆ చింతకాయ పచ్చడి పద్ధతులు ఇప్పుడు లేవు" అన్నాడు.

నాకు ఒళ్ళుమండింది!

"ఏది చింతకాయపచ్చడి పద్ధతీ? మేం చిన్నప్పుడు బడికెళ్ళి అందరం పెద్దకారున్న మా స్వరూపరాణితో సహా నేలమీద కూర్చుని మెడెత్తి బ్లాక్ బోర్డ్ చూస్తూ చదువుకున్నాం. ఇప్పుడిలా ‘వాళ్ళు BMW కార్లో పిల్లని స్కూల్‌కి పంపిస్తున్నారు... మనం హోండా సిటీలోనైనా పంపించాలని’ అసమానత్వం గురించి ఏడుపులు లేవు. బడికెళ్ళి కంపాస్ బాక్స్‌ల్లో పచ్చిమామిడికాయ ముక్కలూ.. మాగాయి ఒరుగులూ తీసుకెళ్ళి అందరం పంచుకు తినడం నేర్చుకున్నాం. ఇలా ఎవరి డ్రైవర్లు వాళ్ళకి సెపరేట్ క్యారియర్లలో తెచ్చేవాళ్ళు కాదు! ఇంక ‘ఇకో ఫ్రెండ్లీ’ అంటావా క్లాస్ రూమ్స్‌లో కృత్రిమ ఆటవస్తువులూ, జలపాతాలూ, సూపర్ మేన్ కార్టూన్ ఫిల్ములూ కాదు! మేం చెట్లెక్కి కోతికొమ్మచ్చులూ.. కుంకుడుగింజలన్నీ దాచుకుని, వామనగుంటలూ, బయట నేలమీద ముగ్గేసుకుని, తొక్కుడు బిళ్ళా, ‘కో’ ఆటాలాంటి ఆటలు ఆడుకుని పెరిగాం! స్వచ్ఛంగా ఆరుబయట.. మా పీ.టీ టీచర్ నవల చదువుకుంటూ చెట్టుకింద కూర్చునేది! మాకు పర్యావరణంతో స్నేహం కాలేదా? చెట్లెక్కడం రాలేదా? గోడలు దూకడం రాలేదా? అసలు మాకు ఒకటో క్లాసులోనే చిన్న బాలశిక్ష కంఠతా వచ్చు! ఇప్పటి పిల్లలకి వచ్చా? ఏదో ఒక భాష మీద పట్టు ఆరోక్లాసు కల్లా వచ్చేసేది! నేను పదో తరగతిలో ఉండగానే, ‘వేయిపడగలు’ చదివేసాను... అర్థంకాలేదనుకో! Who Cares? అక్షరాలు చదవడం వచ్చిందా? రాలేదా? ‘రెన్ అండ్ మార్టెన్’ గ్రామర్ బుక్ ‘కీ’ తో సహా అమ్మమ్మ అప్పచెప్పించుకునేది! లెక్కల పుస్తకంలో, వెనకిచ్చే ఆన్సర్లు పేజ్ నెంబర్లతో సహా మాకు గుర్తు!

అంతెందుకు? బాదంకాయలో పప్పు బద్దలవకుండా ఒకే దెబ్బకి కొట్టి తియ్యడం.. బట్టలమీద పడకుండా మావిడి పండు చీకి తినడం.. ఇప్పటి పిల్లలకి నేర్పించగలరా?

అరే?... ఆరునుండి యాభై ఎనిమిది చుక్కల ముగ్గు మాకు ఐదోతరగతిలోనే వచ్చు! చేతులు నల్లగా అవకుండా నూనె రాసుకుని అరిటిపువ్వు వలవడం, పీట మీద చింతకాయపచ్చడిలో గింజలు తియ్యడం, అమ్మలకి ఇబ్బంది వస్తే అన్నం వార్చి పప్పూ, కూరా వండడం, ఆడా, మగా బేధం లేకుండా నాలుగో క్లాసులోనే వచ్చు. అసలు మా చిట్టెత్తయ్య కొడుకు రఘుకి ముగ్గుల్లో ఫస్ట్‌ప్రైజు వచ్చేది! ముగ్గుల్లో రంగులు నింపి సందులో 'మైకేల్ ఏంజెలో'లా నింపేసేవాడు! ఇవన్నీ వదిలెయ్. ఇప్పుడు పెద్దవాళ్ళు ఇంటికొస్తే 'ఏవండీ మావయ్యగాడూ... మంచి నీళ్ళు తాగుతారా?' అని మర్యాద చేసే బుడుగుని ఒక్కడ్ని చూపించు చాలు! ఎంతసేపూ వాళ్ళకి సెపరేట్ రూమ్... సెపరేట్ టాయ్స్.. వాళ్ళకి అలవాటైన టీచర్ కంఠస్వరం.. 'ఆ నీళ్ళు తాగకూడదూ.. ఈ ఫుడ్ తినకూడదూ' అనే రిస్ట్రిక్షన్స్.. ఒక టైం కి క్రమపద్ధతిలో అలారం సెట్ చేసినట్లు తినాలి, ఆడుకోవాలి... 'రోబోట్స్'లా మ్యూజిక్ వినిపిస్తే లేచి డాన్స్ చెయ్యాలి! నిద్రరాకపోయినా 'స్లీపింగ్ అవర్స్' అనగానే పడుకోవాలి. ఏడుపొస్తే ఏడవకూడదు... కోపం వస్తే పక్కపిల్లాడ్ని కొట్టకూడదు! దానికి పెద్ద పనిష్మెంట్ ఏవిటో తెలుసా? ఈ స్కూల్లో.. ఓ మూలకి వెళ్ళి స్ట్రెస్ రిలీఫ్ కోసం వాళ్ళు పెట్టిన పరికరాలు వాడి పిల్లాడు కోపం తీర్చుకుని, ఏ పంచింగ్ బ్యాగ్' నో గుద్ది వచ్చెయ్యాలి!"

మా వాడికి ఈసారి చిరాకు కాదు నా వెనకబడిన తనం మీద జాలికలిగిందట! "నిన్ను చూస్తుంటే నాకు తెగ జాలి కలుగుతోంది.. నువ్వు తప్పకుండా ఆ స్కూల్‌కి రావాలి.. నీ దృక్పథం మారుతుంది. బిర్లా కూడా వస్తున్నాడు. నీతో టైం వేస్ట్ చేసుకోలేను.. చాలా మీటింగ్స్ ఉన్నాయి..అసలు ఇంతసేపు నువ్వు హేళన చేసిన ఈ ప్రీ స్కూల్ కోసం పద్దెనిమిది మంది ప్రపంచంలోకెల్లా అతి పెద్దవిద్యావంతులతో కమిటీ వేసి, మూడేళ్ళు పరిశోధనలు చేసి ఎంత శ్రమ పడ్డామో.. గూగుల్‌లో కెళ్ళి సెర్చ్ చెయ్యి! పిల్లల్ని కనేసి, ఏదో ఓ స్కూల్ కి పంపేస్తే చాలదు!" అని తెగ కోప్పడి "మన పాత గ్యాంగ్ అందరినీ కూడా తీసుకురా... బరిస్తాలో కలుద్దాం" అని పెట్టేసాడు.

నేను 'తూ...ఛ' తప్పకుండా, మా పాత గ్యాంగ్‌కి ఫోన్లు చేసి, ఆ రోజున సిట్టింగ్స్ అన్నీ మధ్యాహ్నం మూడు గంటలకల్లా అవచేసుకుని, ఆ ఎడ్రెస్‌కి ఫ్రెండ్స్‌తో కలిసి వెళ్ళాను.

"ఆహా!.. ఐశ్వర్యం చిందులు వెయ్యడం అంటే ఏవిటో ఆ బడి దగ్గర ఉన్న పార్కింగ్ ఏరియాలో కార్లని చూస్తే తెలిసింది! లోపల ఈవెంట్ మేనేజర్లు సూటూబూటూ వేసుకుని, ఎవరు బట్లరో, ఎవరు బిర్లానో తెలీని పరిస్థితిలో ఉన్నారు. వెళ్ళగానే బిర్లాగారు లోపల పూజలో ఉన్నారు. మీరు స్నేక్స్ తీసుకోండి అని తెగ మర్యాదలు చేసారు. అక్కడ రకరకాల తినుబండారాలూ, సాఫ్ట్ డ్రింక్స్ రెడీగా ఉన్నాయి.

మా ఫ్రెండ్ ఒకతను జోక్ పేల్చాడు "వీళ్ళు అందరూ మనలాంటి వేస్ట్ కాండిడేట్స్‌ని పిలిస్తే ఎలా? కొత్తగా పెళ్ళయి, ఇష్యూస్ లేని వాళ్ళని పిలవాలి కానీ" అని! ఇంతలో ఒకే పిల్లున్న మా ఫ్రెండ్ ఒకావిడ, సెకండ్ ఛాన్స్ గురించి ఆలోచించేమో "తినడం, త్రాగడం తరువాత.. ముందు లోపల ఎలా ఉందో చూసి వద్దాం" అంది.

సరే అని లోపలికి వెళితే మా తమ్ముడు వీడియో కెమేరాల మధ్యా, ప్రముఖుల మధ్యా సతమతమైపోతూ కనిపించాడు! అయినా నన్ను చూసి మొహం విప్పార్చుకుని వచ్చి "చూసావా? ఎలా ఉందో?" అన్నాడు. ఈ లోగా చాలామందికి "హే షి ఈజ్ ఎ ఫేమస్ రైటర్.. మై ఫ్రెండ్ సో ఎండ్ సో" అని ప్రేమగా పరిచయం చేసాడు. అంతా కరచాలనం చేసి తెగమాట్లాడారు. ఎటు చూసినా డబ్బు వాసన గుప్పున కొట్టింది!

లోపల క్లాస్ రూమ్స్ బ్రహ్మాండంగా ఉన్నాయి. పిల్లలు పడిపోయినా దెబ్బలు తగలకుండా రబ్బరు స్కర్టింగులూ.. కింద పరుపులు.. ఓహ్! మయసభలా ఉంది. చిన్నప్పుడు మాకు మోచేతులూ, మోకాళ్ళు పెచ్చుకడుతుంటే మళ్ళీ కొత్త దెబ్బలు తగిలించుకునేవాళ్ళం.. అది గుర్తొచ్చింది.

దేవకి అనే టీచర్ రకరకాల వస్తువుల పేర్లు రాసిన 'డ్రా' చూపించి ఇందులోనుండి పిల్లలు వాళ్ళే మనం పేర్లు చెపితే వెళ్ళి 'సిజర్స్ ... స్క్రూ డ్రైవర్.. కప్' లాంటివి తెస్తారని చెప్పి తెగ ఆశ్చర్యపోయింది. నాకు ఇప్పుడింక అవకాశం లేదు కాబట్టి, మనవలు పుడితే ఇక్కడే చేర్పించాలని మాట తీసుకుంది.

నాకైతే అక్కడ చిన్న చిన్న బెడ్స్, బుజ్జి బుజ్జి వాష్ బేసిన్లూ, కమోడ్స్ చూస్తుంటే "స్నో వైట్ అండ్ ద్వార్ఫ్స్" కథ జ్ఞాపకం వచ్చింది.

ఇవతలకి వస్తుంటే "చిన్నప్పటినుండీ ఇలాంటి చోట్ల పెరగాలి.. ఇండియాలో ఈ కాన్సెప్ట్ లేదు అందుకే మనం సిస్టమేటిగ్గా పెరగలేదు. దీని వెనకున్న కారణం ఇదే ఈ కాన్సెప్ట్ స్కూల్లో మూడో నెలవయసు నుండే ఉంటే, వాళ్ళ సిస్టమ్ వేరుగా ఉంటుంది. దేశం మారిపోతుంది. ప్రగతి పథంలో పయనిస్తుంది" అన్నాడు మా తమ్ముడు.

నేను అంతా విని" బావుంది! నేను నీతో ఏకీభవిస్తున్నాను... అందరూ.. అన్ని ఎకనమిక్ క్లాసులవారూ తమ పిల్లల్ని చేర్పించే విధంగా ఉందా మీ స్కూల్ ఫీజ్?" అని అడిగాను.

అతను ఈసారి నా అజ్ఞానానికి అసహ్యించుకుని ఉంటాడు.. చెప్పలేదు!

"ఆఫ్టాల్ 60,000 పర్ మంత్ .. ఈ రోజుల్లో కష్టమా?" అన్నాడు.

"కాదులే" అన్నాను.

ఇండియాలో ఇంకా నెలసరి ఆదాయం ఆరేడు వేలు దాటని కుటుంబాలు చాలా ఉన్నాయని మావాడు మరిచిపోయాడు!

సమాజంలో ఒక వర్గం వాళ్ళ కోసం అత్యాధునికమైన శాస్త్రీయమైన మేధావుల చేత నిర్ణయింపబడిన అతి గొప్ప ఆర్కిటెక్ట్స్ నిర్మించిన బడులు కట్టి ' ఈ కాన్సెప్ట్ తో నవసమాజ నిర్మాణం జరుగుతుంది' అని చెపుతున్నాడు Let us hope for the best than criticize….. రేపు నా మనవలూ వెళతారేమో?

కొసమెరుపు ఏమిటంటే.. "సాయీ బిర్లాగారిని పరిచయం చెయలేదేం? చిన్నప్పటినుండీ టాటా బిర్లాల పేర్లు వినడమే కానీ వాళ్ళ వంశీయుల్ని చూసే ఆస్కారం రానే లేదు" అన్నాను ఆశాభంగంగా.

"అదేంటీ? ఇందాక ఎల్లో టీ షర్ట్ లో వచ్చి నేను 'యష్'అని చెప్పగానే, నీకు షేక్ హాండ్ ఇచ్చి మాట్లాడలేదూ?" అన్నాడు.

నేను ఈసారి నిఝంగానే ముళ్ళపూడి రమణగారి స్టైల్లో 'హాశ్చర్యపోయాను'!

ఎల్లో టీ షర్టూ, జీన్స్‌లో, తలమీద ఎరుపూ, నీలం రంగు జుట్టుని స్పైక్స్‌గా మలుచుకుని వచ్చిన ఆ కుర్రాడు 'బిర్లానా?' అని!. మనం బిర్లా అంటే మన మనసులో ఏదో ఒక రకంగా చిన్నప్పటి నుండీ ఓ ఆకారం ఊహించుకుని ఉంటాంగా మరీ!

అప్పుడు అనుకున్నాను. May be I am Wrong…. కాలం వేగంగా మారిపోతోంది... అనింట్లో వేగం.. వడీ వచ్చేసాయి! మార్పుని అంగీకరించకపోవడం ప్రగతి నిరోధకం!

పిల్లాడు కడుపులో పడగానే అమ్మ బడిలో చేరడం రైటేనేమో?